క్లుప్తంగా

నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు (బుధవారం) పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భూకబ్జా చేస్తే చర్యలు

రేగొండ: మండలంలోని చెరువు శిఖం భూములను కబ్జా చేసే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ సత్యనారాయణ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేగొండ గ్రామ శివారులోని దామెర చెరువు శిఖం సర్వే నంబరు 20లో గల భూమిని ఆక్రమించే ప్రయత్నం చేసున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. శిఖం భూమిలో కట్టడాలు నిర్మించిన వాటిని తొలగించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

రేగొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

ఎస్పీని కలిసిన సీఐ రవీందర్

ములుగు: గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్(సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన రవీందర్ మంగళవారం జిల్లాకేంద్రంలో ఎస్పీ డాక్టర్ శబరీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. కాగా, పస్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సీఐగా ప్రమోషన్ పొందిన రవీందర్ బదిలీలో సీసీఎస్ సీఐగా జిల్లా కేంద్రానికి వచ్చారు. తదనంతరం ఆదే స్టేషన్‌కు సీఐగా బదిలీయ్యారు.

వైద్యాధికారికి సన్మానం

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్‌ను ఆశ కార్యకర్తలు మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్, ల్యాబ్‌టెక్నీషియన్లు తదితరులు ఉన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ మంగళవారం పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంగపేట: వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. పీహెచ్‌సీలో స్పెషల్ స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి పీహెచ్‌సీ పరిధిలోని ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యమున మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రైడేను నిర్వహించాలని, గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో గ్రామాల్లో జనావాసాలు అంతర్గత రోడ్లు, మురుగు కాలువల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అదే విధంగా ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి

గోవిందరావుపేట: ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని తుమ్మల వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పస్రా గ్రామంలో గుడిసెవాసుల ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం కదారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తుమ్మల వెంకట్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని ఈ నెల 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేస్తామని అన్నారు. పస్రా నాగారం రెవెన్యూ పరిధిలో పేదలు రెండు సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎంపీ బలరాం నాయక్ పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను గుడిసెవాసులకు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుకను తోడేస్తున్నారు..


గర్మిళ్లపల్లి శివారు మానేరులో ట్రాక్టర్‌లో ఇసుకను నింపుతున్న కూలీలు


చిట్యాల మండలం శాంతినగర్ పత్తి మిల్లులో నిల్వ చేసిన ఇసుక డంపు

- స్థానిక అవసరాల పేరుతో అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: మండలంలోని చలివాగు, మానేరులే లక్ష్యంగా ట్రాక్టర్ యజమానులు ఇసుక వ్యాపారాన్ని చేస్తూ దందా సాగిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా పగలు, రాత్రి ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరంతరంగా ఇసుక రవాణా కొనసాగుతుండడంతో అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే వాదన మండలంలో బలంగా వినిపిస్తుంది.

స్థానిక అవసరాలకు అనుమతి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక అవసరాలకు ఇసుక రవాణాకు అనుమతించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే అదునుగా తీసుకున్న కొంత మంది ఇసుక వ్యాపారులు అధికారుల కళ్లు గప్పి ఇసుకను జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఇసుక క్వారీని ఏర్పాటు చేస్తామని, దాని ద్వారానే ఇసుక రవాణా అనుమతులు జారీ చేస్తామని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సైతం వస్తుందని ప్రకటించినా ఇప్పటి వరకు క్వారీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఎక్కడపడితే అక్కడే చలివాగు, మానేరుల్లో ఇసుకను తోడేస్తున్నారు.

పత్తాలేని అధికారులు..

చలివాగు మానేరుల నుంచి ఇసుక ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నా కేవలం పోలీస్ మాత్రమే పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. రెవెన్యూ శాఖ అరకొర తనిఖీలు చేపడుతున్నా మైనింగ్, భూగర్భజల, అటవీ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. టేకుమట్ల, చిట్యాల చలివాగు, మానరు పరివాహక ప్రాంతాల నుంచి తరలుతున్న ఇసుక రవాణాలో ఇప్పటి వరకు మైనింగ్, భూగర్భజల, అటవీశాఖ అధికారులు ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పేరు చెప్పుకొని..

ట్రాక్టర్ ఓనర్లు చలివాగు, మానేరుల నుంచి అక్రమ ఇసుక రవాణాను కొనసాగిస్తున్న వారికి పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో ఎమ్మెల్యే స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకోమంటున్నాడంటూ, ఎమ్మెల్యే అనుమతి తీసుకున్నామంటూ తప్పుదోవ పట్టిస్తున్నారు. కొన్ని రోజులుగా చిట్యాల మండలం, శాంతినగర్‌లోని పత్తి మిల్లులో వందల సంఖ్యలో నిల్వ చేసిన ఇసుక ట్రిప్పులపై అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇండస్ట్రీయల్‌కి ప్రభుత్వ క్వారీల నుంచి ఇసుకను తరలించాల్సి ఉండగా స్థానిక ట్రాక్టర్ యజమానులు చలివాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్

భూపాలపల్లి అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించే పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ పిలుపునిచ్చారు. స్థానిక రావినారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోసఫ్ మాట్లాడుతూ.. నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. టీఐఎస్ఎస్ ముంబై, ఐఐటీ ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు ఆపాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు మేధావులు పాల్గొని బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మాతంగి దిలీప్, ఇందారపు అరవింద్, విష్ణు, చల్లూరి రక్షిత, రేవెల్లి రాధికలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: బీజేపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని లేకుంటే కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం తప్పదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్ అన్నారు. వర్గీకరణ సాధన కోసం ఈ నెల7న ఇందిరపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని మంగళవారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై7న ఎమ్మార్పీఎస్‌టీఎస్ ఆవిర్భావం జరిగి 30 సంవత్సరాలు గడుస్తుందన్నారు. వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉండి పార్లమెంట్‌లో మెజారిటీ బలం ఉన్నప్పటికి వర్గీకరణ అంశాన్ని పక్కన పెడుతూ వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ బిల్లుకు కార్యరూపం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీక్షకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు పొట్ట పోశయ్య, వేమునూరి జక్కయ్య, చిలుక నరేశ్, సమ్మయ్య, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి


ఎంపీపీ రాణిబాయికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

కాళేశ్వరం: ఉద్యమకారులను ఆదుకోవాలని మహదేవపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర నాయకుడు ఆయూబోద్దీన్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఎంపీపీ బన్సోడ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ఉద్యమకారులను స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జనరల్ సెక్రటరీ కలికోట దేవేందర్, ఆన్కారి ప్రభాకర్, అక్రమోద్దీన్, పిడుగు సమ్మయ్య, రహిమత్ ఖాన్, జనగామ పోచం, కేదారి ప్రవీణ్ కుమార్, పోత రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వన మహోత్సవం'పై అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన వన మహోత్సవ కార్యక్రమంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహబూబ్ హుస్సేన్ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫిల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, ఏపీఓ అలీం పాషా, ఏపీఎం రవి వర్మ, టెక్నీకల్ అసిస్టెంట్స్ రాము, మౌనిక, నిరంజన, సెర్ప్ సీసీలు శ్రీనివాస్, బాపురావు, ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్, మేట్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి


మాట్లాడుతున్న నోముల శ్రీనివాస్

రేగొండ(కొత్తపల్లిగోరి): ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ వేడుకలను ఈ నెల 7న గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించాలని సీనియర్ నాయకుడు నోముల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో మండల కన్వీనర్ బట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఆమర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ కొత్తపల్లిగోరి మండలానికి మండల కమిటీ ఎన్నిక ఈ నెల 5న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరికెళ్ల మహేందర్, కుమార్, ఓరుగంటి రమేష్, సోమిడి రవి, ఒంటేరు రమేష్, ఈసంపల్లి కుమార్ తతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


లక్ష్మి మృతదేహం

కాటారం: అనారోగ్యం, కుటుంబ పరిస్థితులతో మనస్థాపానికి గురైన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం కాటారం మండలం గుమ్మాళ్లపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకనాల లక్ష్మి(46) భర్త రాజయ్య నాలుగు ఎకరాల సొంత భూమిలో పత్తి సాగు చేయగా గత ఏడాది అధిక వర్షాల కారణంగా దిగుబడి సరిగా రాక రూ.4లక్షల మేర అప్పు అయ్యారు. లక్ష్మి అనారోగ్యం బాగోలేకపోవడంతో ఆపరేషన్ కోసం రూ.లక్ష అప్పు చేశారు. అంతే కాకుండా కూతురు జమునకు వివాహం చేయగా ఓ ఆడపిల్లకు జన్మనిచ్చి ఆరేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో కూతురు బిడ్డ సైతం వీరి వద్దనే ఉంటుంది. ఇటు పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుతో పాటు తన బిడ్డ చనిపోయిన బాధ, బిడ్డ కూతరు బాగోగులు చూసుకోవడం ఎలా అని తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మి సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి, అక్కడి నుండి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ లక్ష్మి మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త రాజయ్య, కుమారుడు దేవేందర్ ఉన్నారు. రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

నేడు 'రైతు భరోసా'పై సమావేశం

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతువేదిక కార్యాలయంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నేడు (బుధవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుభరోసా పథకం అమలుపై రైతులు సలహాలు, సూచనలు తెలపడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌భాస్కర్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. రైతులు, సంఘం సభ్యులు పాల్గొనాలని తెలియజేశారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగారావు అధ్యక్షతన నిర్వహించిన రైతుల మహాజన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ అమలు జరుగుతుందన్నారు. అ సమావేశాలల్లో పాల్గొన్న పలువురు పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ.. ఐదెకరాల నుంచి పదెకరాల లోపు భూమి కలిగి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా పథకం అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా, మరికొందరు రైతులు వాస్తవంగా సాగు చేసుకునే రైతులతో పాటు కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయాలన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రైతుల సూచనలన్నింటినీ ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆధ్వర్యంలో రైతు భరోసా అమలుపై ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి మంగళవారం అభిప్రాయాలను సేకరించారు. పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక మహాజనసభ పేరిట సమావేశం నిర్వహించారు. రైతు భరోసా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు అంశాలను ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఈ సమావేశంలో వివరించారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించగా అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాధిక, మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, సీఈఓ ఎడ్ల సతీశ్, డైరెక్టర్లు చీమల సత్యం, రాజబాబు, అజయ్, హిమాకర్, రమేశ్, రాజయ్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ సోమ శాంతకుమార్ అధ్యక్షతన మంగళవారం రైతు భరోసా పథకంపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల నుంచి రైతు భరోసా పథకంపై సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఏడీఏ శ్రీనివాస్‌రాజు, డీసీఓ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్టర్ రాధిక, ఏఓ సతీష్, ఏఈఓలు శివకృష్ణ, పుష్పలత, ఆస్మా, సీఈఓ మార్క శ్రీధర్, సహకార సంఘంసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ అధ్యక్షుడు సల్ల తిరుపతయ్య అధ్యక్షతన జిల్లా సహకార అధికారి డి.శైలజ ఆధ్వర్యములో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసాపై రైతుల నుంచి సలహాలు సూచనలు తీసుకున్నారు. సంఘం కార్యవర్గ సభ్యులు, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ గుడాల అరుణ ఏఈఓలు, సీఈఓ కుమ్మరి రాజబాబు, సిబ్బంది మహదేవపూర్, పలిమెల మండల రైతులు పాల్గొన్నారు.


కాళేశ్వరం: మాట్లాడుతున్న సల్ల తిరుపతయ్య


కాటారం: మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

ఎల్‌ఓసీ అందజేత



మహాముత్తారం: మండలంలోని గండి కామారం గ్రామానికి చెందిన గండి ప్రశాంత్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఎం సహయ నిధి కోసం ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబను బాధిత కుటుంబ సభ్యులు కోరారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.70వేల ఎల్‌ఓ సీని మంత్రి మంజూరు చేయించారు. మంగళవా రం శ్రీధర్ బాబు ఆస్పతి సహయకుడు సచిన్ ప్రశా ంత్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ ప్రధాన చౌరాస్తాలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంటులో రాహుల్ గాంధీ హిందువులను హింసవాదులని కించపరిచిన నేపథ్యంలో దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, యువ మోర్చ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, ఉపాధ్యక్షుడు అంకరి రాజేందర్, సీనియర్ నాయకులు కన్నెబోయిన ఐలన్న, పూర్ణచందర్, కొక్కు శ్రీను, నాగుల సాయి, జాడి మనోజ్, దడిగెల వెంకటేష్, శ్యామల ప్రశాంత్, సంపత్, రాకేష్, సంతోష్, మధుకర్ పాల్గొన్నారు.

మజీద్‌పల్లికి విద్యుత్ కష్టాలు

కాళేశ్వరం: చిన్న పాటి గాలి వీచిన, వర్షం కురిసిన కాళేశ్వరం పరిధిలోని మజీద్‌పల్లి వాడకు రాత్రివేళల్లో విద్యుత్ లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మజీద్‌పల్లి వాడకు సుమారు 200లకుపైగా ఇళ్లు ఉన్నాయని సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోతున్నారు. ప్రతీరోజు రాత్రి సమయంలో కరంట్ లేకపోవడం నిత్యకృత్యంగా మారిందని మజీద్‌పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు, విషకీటకాల భారిన పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎన్పీడీసీఎల్ అధికారు సమస్యను తెలుసుకొని శాశ్వతంగా మరమ్మతులు, కొత్త లైన్ పునరుద్ధరణ చేయాలని పలువురు కోరుతున్నారు. కాళేశ్వరం రూరల్ ప్రాంతంలో కూడా రాత్రి సమయంలో కరంటు కోతలు పెడుతున్నారు. కాగా, ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.